అయిుంది, అబ్బాయిగారి పెళ్లి!

అవసరాల రామకృష్ణారావు

ఇప్పుడే సినిమా విడిచిపెట్టేరు. వచ్చేస్తుంటే శర్మ కనిపించాడు.

'ఏం భాయీ, చిన్నతనంలోనే పుణ్యకార్యాలకి పూనుకున్నావు. ఈమధ్య మళ్లీ నీ చలవవల్ల మన ఎరికని ఎక్కడైనా సంబంధాలు జతపడ్డాయా?' అన్నాను నేను. శర్మ చురచుర చూస్తూ గబగబ నడిచి వెళ్లిపోయాడు. అబ్బో అదంతో బోలెడంత కథ!

* * *

మా క్లాసుమేట్ సుశీల అందమైనదే, ఒప్పుకుంటాను. కాని - పద్దెనిమిదేళ్ళు పైబడినా పరికిణీవాణీ వేసుకోడం, జడ సరిగ్గా భుజందగ్గిర అల్లిక మొదలెట్టి రెండే రెండు అల్లికలు అల్లి ఆ పాయల్ని అలా గాలికి వదిలెయ్యడం, పృధివిలో పువ్వులే కరువైనట్టు రెండు ముక్కా ముక్కల క్రోటన్సు ఆకులు ఆ తలకట్టులో గుచ్చుకోడం, వచ్చినా చెమట పట్టని చలికాలంలో సహా నడుముకి కుడిచేతివైపున తెల్లని రుమాలు మడత నలుగురికీ కనపడే చోటున దోపుకోవడం, కంగారు పిల్లని కన్నతల్లయినా వదులుతుందేమో గాని అందులో దమ్మిడీ లేకపోయినా ఎల్లప్పుడూ హేండ్ బ్యాగ్ ధరిస్తూఉండడం — సుశీల అలంకారాలని భావించవచ్చును గాని అలవికారాలని నా నమ్మకం. ఎందుకో తెలియకుండా మాటాడితే నవ్వడం, ఎత్తెత్తి అడుగులు వెయ్యడం, ఎంతటివారినయినా ఎకసక్కెం చెయ్యడం సుశీలకు సుగుణాలుగా కనిపించవచ్చు గాని, అదొక రకం ఆడపిల్లల జబ్బు లక్షణాలుగానే భావిస్తాను అందుకే ఆమె అందమైనదంటే ఒప్పుకుంటాను గాని ఆ అతిశయాన్ని భరించలేను. అయితే సహజ సౌందర్యంగల ఆ సుందరికి యీ లక్షణాలు వీడొక్కడూ వికారాలని వివరించాడు గాని ఆమె చుట్టూ అల్లంత దూరంలో గల్లంతుచేసే కందరీగలకు అవి అలంకారాలే.

ఇదంతా ఎందుకు గాని, ఒకనాడు ఆ అమ్మాయి కొత్తపేట ఘోషాసుపత్రి సందులోంచి సైకిలు రిక్షాపై వస్తుంటే వెనకనే సైకిలుపై వస్తున్న మా కెమిస్ట్రీ లెక్చరర్ నటరాజన్ పలకరించకుండా ఉండలేకపోయాడు.

'హల్లో సుశీలా, ఎక్కణ్నుంచీ ఏమిటి కథా?'

"మేటినీకి వెళ్ళొస్తున్నాను. 'హౌటు మేరీ ఎ మిలియనీర్'. నాకు సరిగ్గా అర్థం కాలేదు."

'సరిగ్గా అర్థం చేసుకుంటే అదే అర్థమౌతుంది' అని అదోలా చూశాడు నటరాజన్. ఆ చూపులో 'నేనూ ఒకవిధంగా మిలియనీర్నే. నన్నే పెళ్ళాడకూడదూ? ఇందులో అర్థంకానిదేముంది' అన్న భావం స్పష్టంగా కనిపిస్తోంది. ఎదురుగా వీస్తున్న యీదురుగాలికి సుశీల ముంగురులూ, దుస్తులూ తమాషాగా ఎగురుతున్నాయి. చుట్టూ ఎవరూ లేరు. నటరాజన్‌కి ఎన్నో సంగతులు చెప్పాలనిపించింది.

'ఏమిట్రా ఆ తొందరా? రిక్షా కాస్త నెమ్మదిగా పోనియ్. లిక్విడిఫికేషన్ ఆఫ్ ఎయర్ అర్థమయిందా సుశీలా?' అని ఆరోజు పాఠంగురించి మామూలు ప్రశ్న వేసి 'ఛస్ యిలాంటి చచ్చు ప్రశ్న వేశానేమిటి?' అని నిందించుకున్నాడు నటరాజన్. సుశీలకు వాయువును ఎలా ద్రవీభవనం చేస్తారో కొంత అర్థమయింది. కాని ఈ గోమాయువు ఎందుకిలా నీరయిపోతున్నాడో ఓ పట్టాన అర్థంకాలేదు.

'బాగానే బోధపడిందిసార్! మీరు ఓసారి చెబితే వెంటనే అర్థమయిపోతుంది సార్'. నటరాజన్ కొత్తగోదావరిలా పొంగిపోయాడు. ఇంక ఆలస్యంచేస్తే లాభం లేదు.

'అంతేనా? అంతవరకేనా అర్థంచేసుకున్నది?'

'తర్వాత పాఠం చెప్పందే ఎలా బోధపడుతుంది సార్?' అంది నవ్వుతూ సుశీల. ఆ అమ్మాయికి తెలియనేలేదా, తెలిసే యిలా ఏడిపిస్తోందో నటరాజన్‌కి బోధపడలేదు.

'పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి, బాగా చదువుతున్నావా? క్లాస్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావా?'

ఇదే ఎవరిదగ్గిరో అయితే సుశీల ఎన్ని గొప్పలు చెప్పుకుని ఉండునో! కాని ఆ అడిగింది తన మెయిన్ సబ్జెక్ట్ కెమిస్ట్రీ లెక్చరర్ అయొను! అందులో ఛీఫ్ ఎగ్జామినరు కూడాను!

'ఎందుకు మేష్టారూ అర్థంలేని ఆశలూ? ఫిజికల్ కెమిస్ట్రీ నాకు బొత్తిగా పూర్! కంప్లీట్ చేస్తే అంతే చాలు!'

'అమ్మమ్మ, ఎంతమాటన్నావ్? చదివించే వాడు మనవాడైతే కడబంతిని కూర్చుంటేనేం? నేనుండగా నువ్వంత నిరాశపడవలసిన అవసరంలేదు. నీకు క్లాసు వచ్చే పూచీ నాకు వదిలిపెట్టు' సుశీల మాట్లాడకుండా తలవంచుకు కూర్చుంది. దూరంనుంచి ఎలక్ట్రిక్ లైట్ల వెలుతురు చెట్లచాటునుంచి అప్పుడప్పుడు కనిపిస్తోంది.

'ఇంకేముంది, మాట్లాడినట్టే లేదూ! అప్పుడే వచ్చేసింది. ఈ ఆసుపత్రి కాంపౌండు గోడ యింకొంచం పొడుగ్గా కట్టించి ఉంటే ఈ మునిసిపాలిటీ వాళ్ల సొమ్మేం పోయిందీ?' అని విసుక్కున్నాడు నటరాజన్. సీరియస్‌గా మొహం పెట్టి అన్నాడు.

'సుశీ, నీకెలా చెప్పను, అర్థమౌతుందా?'

'అదేమిటి మేష్టారూ, మీరు చెప్పింది ఏది అర్థమవలేదు గనక? సబ్జెక్ట్ ఎంత డిఫికల్ట్‌గా ఉన్నా యిట్టే అరిటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు చెప్పేసే వారుగద!'

'అది నిజమే అనుకో. పెద్దపెద్ద యింగ్లీషు పుస్తకాలు చదివి ఏదో క్లాసులో తంటాలు

రవి టాయ్‌లెట్స్

అందముకు,
వర్చస్సుకు

సోల్ ఏజంట్లు —
ది న్యూ స్టార్ & కో., మద్రాసు 21.

పలేవాడిసే అనుకో. దాని సంగతి ఎందుకు గాని – ఈ మనస్సు ఉండే దీనిభావాన్ని ఒక్క నోటితోనే వ్యక్తపరచడం కష్టం. నా పెదవులు చూడు, కళ్లు చూడు'

'అలాగే చూస్తాను గాని ముందు కంకర్రాళ్లకుప్ప వుంది. మీరు చూసుకోండి సైకిలు చెట్టెక్కను!'

ఈ మాటకి రిక్షావాడు కూడా నవ్వేడు. నటరాజన్ హేండిల్ బార్ పక్కకి తిప్పి-మంచి మాటల్లో అడ్డొచ్చిన ఆ రాళ్లకుప్పని తనివితీరా తిట్టుకున్నాడు. సుశీలే అంది,

'అవును పెదవులు ఒణుకుతున్నాయి, కళ్లమ్మట నీరు కారుతోంది!'

'సరిగ్గా అదే.'

'ఈ పక్కది ఆడవాళ్ల హాస్పిటలు అయిపోయింది. లేకపోతే నేనే వచ్చి మిమ్మల్ని స్వయంగా జాయిన్ చేయించి ఉందును. ఏమిటి బాధ?'

'అబ్బో, అదో పెద్దగాథ! ఈ బాధకి చికిత్స హాస్పిటల్సులో జరగదు. నీలాంటి సుందరి హాస్పిటాలిటీ కావాలి ఇంకా నీకు అర్థం కాలేదంటే నేను నమ్మను. ఇంక నీకు చెప్పదలచుకోలేదు నువ్వే నాకు జవాబు చెప్పుకోవలసి ఉంది.'

ఆ చతురిక చూపుల్లో యింకా ఏ భావమూ కనపడకపోడం నటరాజన్‌కి ఆశ్చర్యం కలిగించింది.

'అర్థమయింది మేష్టారూ, దీనికి జవాబు రేపు మధ్యాన్నం సైన్సు హాలులో లీజర్లీగా చెబుతాను.'

'అలాగే చెబుదువు గానిలే. ఒక్క విషయం మాత్రం జ్ఞాపకముంచుకో. బియ్యేస్సీలో ఆర్డినరీగా పాసవడంకంటె విత్‌డ్రా అవడం మంచిది. ఇది పరతూ అనీ, బేరం అని నువ్వు అనుకోవద్దు గాని నే చెప్పిన విషయం వప్పుకుంటే మాత్రం నీకు క్లాసు ష్యూర్! గుడ్ నైట్'

అది చిన్నదారి. సైకిలు రిక్షా, సైకిలూ పేర్లల్‌గా నడుస్తున్నాయి. అవనక అయిదు నిముషాలనుంచీ ఒక సైకిలు వస్తూండడం నటరాజన్ చూడలేదు గాని సుశీల చూసింది. ఏదో విజయం సాధించినట్టు 'లలలాలా లల్లా లలలా' అని పాడుకుంటూ నటరాజన్



పీత చిత్రకారుడు : సి. యస్. యన్. పట్నాయక్

(మద్రాసు చిత్రకళావిద్యాలయ విద్యార్థుల ప్రదర్శనంలోని చిత్రం. మరికొన్ని చిత్రాలు 7, 20, 21, 28, 29 పేజీలలో ప్రచురించబడినాయి.

త్వరత్వరగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. ఎగురుసుండా 'మోడరన్ కేఫ్' దీపాలు ఒక్కసారి సైకిలు రిక్షా వెనక వస్తున్న రిక్షామీద పడ్డాయి

'ఎవరూ? మిస్టర్ శర్మా?'

ఇదుగో సరిగ్గా యిక్కడే మన కథానాయకుడు శర్మ ప్రవేశం. వాడు మా రూంమేటు కూడాను. అవాళ కొన్న సబ్బు ఆ్రరోజులు తిరక్కుండా రెండంగుళాల దళసరిదే లేకుండా ముక్కై ఊరుకుంటే ఇదంతా నీ నా భేదం లేని శర్మ చేతి చలవే అని గ్రహించి నలుగురూ వాళ్ళ సాయం పట్టి పంపగా నాదగ్గర అరణాల అరువు డబ్బులూ, పక్కరూం పార్థసారథి పాత సైకిలూ తీసుకెళ్ళి లైటు లేని కారణంచేత కొత్తపేట ఘోషాసుపత్రి సందులోంచి కృష్ణా ఎంపోరియం వెడదామని సైకిలు తొక్కుతూంటే ఆఖరి అయిదు నిమిషాల్లో అతిదగ్గర వారినుంచి, అతి ఆశ్చర్యకరంగా అనుకోనే మాటలు అతని చెవుల్లో పడ్డాయి.

ఆ అమ్మాయి రిక్షా ఆపించింది.

'ఏంశారా! ఆ మాట ఒప్పుకుంటే నాకు ఫస్టుక్లాస్ తప్పదుట, బాగుందా?'

'అవునవును—విన్నాను.'

'మీ అవసరం ఏదైనా వస్తే తప్పకుండా సాయం చేస్తారనుకుంటాను ...వస్తాను, వానియ్యరా..'

'లక్షలు విలువజేసే లావణ్య నాతో మాటలాడింది. ఇక యీ ముష్టి అరణాలూ పెట్టి సబ్బు కొంటేనేం కొనకపోతేనేం?' అని మా మిత్రుడు, చేతిలో ఎమిక తప్ప లేనివాడు, నా దగ్గిర బదులుచ్చుకున్న అరణాలూ కాలవపక్క కబోది పక్షికి దానమిచ్చి అరవైమైళ్ళ స్పీడుతో హోష్టలు చేరుకున్నాడు. అప్పుడే నేనూ క్రికెట్ మ్యాచ్ నుంచి రూంకి వచ్చేను వాడు జరిగిందంతా చెప్పేడు. ఏమిటో దీంట్లో అదృష్టం కన్న అరిష్టమే నా కెక్కువగా కనిపించింది.

'ఈ నటరాజన్ యింతటి వాడన్నమాట. సరే అయినా ఏదో ఏదుపు కుంగాముని పొగుపూరి నుంచి యిక్కడికి వచ్చినవాళ్ళం మనకే గొడవందుకు; రేపొద్దుట నిన్నెవరైనా ఏమైనా అడిగితే నాకేం తెలీదని చెప్పు. ఎలాంటివాడైనా అతడు మన ఎగ్జామినరు కొంత జాగ్రతగా ఉండడం మంచిది, నిన్నెవరికీ చెప్పేను అంతేనని యిష్టం'

శర్మ హఠాత్తుగా ఆదర్శవాది అయిపోయాడు. మనుషులిలా ఎందుకు మారిపోతారో తెలీదు

'అయితే అతడు మన ఎగ్జామినరు గదా అని తోటి స్టూడెంట్‌కి అన్యాయం జరుగుతూంటే చూస్తూ ఊరుకోమంటావా! మనకేదో అన్యాయం జరుగుతుందని అబద్ధం

"అర్ధణా టీ"

చిత్రకారుడు: రాళ్ళ వెంకటేశ్వరరావు.

చెప్పి లెక్చరర్ని తెరకొట్టి మెప్పుపొందమన్నావా? స్పష్టంగా చెవులతో విన్నదాన్ని కాదని చెప్పి ఆత్మవంచన చేసుకోమన్నావా?'

ఇక వీడితో లాభంలేదనుకున్నాను మనుషులు ఎవరికేనా ఏదేనా ఉపకారం చేసినప్పుడు అది నిష్కామంగా చేస్తారో ఫలాపేక్షతో చేస్తారో తెలుసుకున్నాను. ఇక మూగ విద్యార్థి అయివుంటే శర్మ యీ ఉపకారం చెయ్యడానికి సాహసించునో సాహసించడో నాకు తెలియదు. అందులో యీ శరణార్థిని ప్రత్యేకించి సుశీలే అయి ఉండడం శర్మ ఆదర్శాన్ని మరింత బలపరచి ఉండవచ్చు

తోటి విద్యార్థినికి యింత అన్యాయం జరగడం శర్మ భరించలేడట. ఆ అన్యాయం చేసింది ఎవరుగానీ, ఎంతటి ఉన్నత పదవిలో ఉండనీ ఖండించి తీరుతాడుట. భగవంతుడికి భక్తులమీదే ఉంది, శర్మకి విద్యార్థినులమీదే ఉంది, అంతటి కరుణ!

'ఇవాళ యిదయింది, రేపు మరొకటవుతుంది. ఇలా అయితే ఆడపిల్లలు కాలేజీకి వచ్చి నిర్భయంగా చదువుకోగలరా?' అని అతి సీరియస్‌గా మాట్లాడ్డం మొదలుపెట్టేడు. శీతాకాలం తెల్లవారు ఝామున రెండంగుళాల దళసరి రగ్గులు కప్పుకుని పెచ్చగా పడుకునే హోష్టలు విద్యార్థులకి ఆరుగంటలకి టిఫిన్ కని కొట్టే కంచుగంట లేపి కూర్చోపెట్టినట్టు శర్మ ఆదర్శవాక్యాలు కొంత బద్ధకస్తుల చెవుల్లోకూడా బలవంతాన దూరి కూర్చున్నాయి.

ఈ కథకి ముఖ్య పాత్రలయిన సుశీలా,

★ అయింది, అబ్బాయిగారి పెళ్లి ★

నటరాజన్ నిద్రపోయారో లేదో నాకు తెలీదు. హాస్టల్లో మాత్రం ఆరాత్రి ఎవరికీ నిద్దర్లు లేవు!

'తండ్రిలేని పిల్లగదా అని యింత చొరవ తీసుకుంటాడా? ఇలా అయితే రేపొద్దున్న చదువున్న ఆడపిల్ల లెవరైనా యీ పరిసరాల కొస్తారా? ఇంత దౌర్జన్యమా?'

నామటుకు నేను రూంలో పడుకుంటే బలవంతాన లేపి కూర్చోబెట్టారు.

'ఇంతింత అక్రమాలు జరుగుతూంటే నీకు నిశ్చింతగా నిద్రెలా పడుతూందోయ్? ఏవో అల్లిబొల్లి కథలు అల్లి పత్రికలకి పంపించడ మనుకున్నావా?'

నా ఒళ్ళు మండిపోయింది.

'ఆ అమ్మాయికి జరిగింది అన్యాయం కాదని ఎవరన్నారు? ఆ అమ్మాయేం నోరులేని పసికూన కాదు. పైగా ప్రిన్సిపాలుకి వరసకి మేనగోడలాయె. మన మందరం యింతలా గింజుకుపోడం దేనికీ?'

'అయితే చూస్తూ ఊరుక్కుమంటావన్న మాట. తీరా మీదకొస్తే ఆ రావణాసురుడు ఏం మార్చి చెబుతాడో! మరో సాక్ష్యముండడం ఎందుకేనా మంచిది కాదూ?'

'మంచిదే, ఆ అదృష్టం నీకే పట్టడం మరీ మంచిదీ!'

'ఒకళ్ళ కేదయినా అదృష్టం కలుగుతే మరొకళ్లు అసూయపడ్డంలో ఆశ్చర్యంలేదు' నేను నిర్ఘాంతపోయాను. అగ్గిపెట్టి మొదలు ఆసుజోడువరకు అరువు ఇచ్చే రూంమేటుని యీనాటికి శర్మకి అసూయపరుడిగా కనిపించానా? ఇంతకీ శర్మకి పట్టిన అదృష్టం వేమిటి గనక? ఈ ప్రశ్నకి సమాధానం పక్కనున్న కృష్ణమూర్తి చెప్పేడు.

'రేపు ప్రిన్సిపాలు నీకు కబురంపించి అసలు సంగతి తెలుసుకోవచ్చు. ఛీఫ్ ఎగ్జామినరు అని అయినా వెనుదియ్యకుండా నిజం చెప్పినందుకు సుశీల నిన్నెంతో కంగ్రాచ్యులేట్ చెయ్యొచ్చు. మాటలు మంచిముత్యాల్లా వాడుకునే ఆ మనోహారి నీకు స్వయంగా పార్టీ యివ్వచ్చు. అది క్రమంగా స్నేహం, స్నేహం...'

'అబ్బ! యింక చెప్పకోయ్ నాకదోలా ఉందీ!' అన్నాడు శర్మ సిగ్గు అభినయిస్తూ.

వరదలో ఉన్న ప్రవాహబలం లాంటది విద్యార్థి బలం. తెల్లవారే సరికల్లా చిన్న చిన్న కాగితాలు అచ్చు వేయించారు 'లెక్చరర్ దౌర్జన్యం' అన్న పేరుతో.

అతికష్టంమీద తెల్లవారింది. అతి నెమ్మదిగా పది గంటలయింది. అతి బ్రహ్మాండం మీద మూడు అవర్సు గడిచి యింటర్వల్ అయింది.

నటరాజన్ శర్మ వాక్యాలతో 'మొహం చెల్లక' ఆనాడు శెలవు పెట్టేడు. అయినా దేనికో మరి కాలేజీకి వచ్చాడు. అతని దాకా అచ్చు కాగితం వెళ్లిందో లేదో గాని అందరి మొహాలమీదా అచ్చొత్తినట్టున్న భావాలు మాత్రం స్పష్టంగా చదువుకున్నాడు. అయినా అతని మొహాన్ని ఇంకా చిరునవ్వే వుండడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. శర్మకి ఆశాభంగమే అయింది.

ఫిజిక్సులో 'వేవ్ థీరీ' చెబుతున్నారు. ఉత్తి రోజులోనే మాకు పాఠాలు ఎక్కువ. ఇంత సందిగ్ధసమయంలో ఏమర్థమవుతుందీ? అందులో ప్రిన్సిపాల్ నుండి కబురు వచ్చి మొదట సుశీలా, తరవాత అరగంటకి శర్మా వెళ్ళేరు. వెళ్ళినవారు ఎంతకీ రారు ఇంకేం వింటాం పాఠాలూ?

ఇందులో మరోలా జరగడాని కేముంది గనక? నటరాజన్ సస్పెండ్ అవుతాడు. లేదా ఏకంగా డిస్మిస్ అవుతాడు. అతని రోజులు దగ్గిరపడి సుశీలలాంటి అందరాని ఫలాన్ని ఆశించాడు. శర్మలాంటి వాడి చెవిని పడ్డాడు. అతనికి కాలేజీకీ రుణాను బంధం సరి ఇక మొహం ఎలా చూపిస్తాడు?

ఏమయిందో ఎవరికీ తెలీదు శనివారం నటరాజన్ శెలవు ఆది వారం కాలేజీకి శెలవు. హాస్టల్లో శర్మ ప్రభావం మాత్రం థర్మామీటరులో పాదరసంలా, నాగుపాము విషంలా చరచర పైకెక్కి కూర్చుంది. ప్రిన్సిపాలు రూంనుంచి రాగానే మాత్రం అతన్నందరూ చుట్టుముట్టేశారు.

—ఏముందీ, ఏం జరిగిందని అడిగారు. జరిగిందంతా చెప్పేశాను.

—అంతా పెద్ద ఏముంది? నువ్వు విన్నది నాలుగు ముక్కలేగా!

—చెప్పాలంటే ఎంతయినా ఉంది. 'వారి జాతులందు...' అన్నారు. అబలా రక్షణలో అబద్ధప్రయోగం చేసినా తప్పులేదన్నారు, శుక్రాచారి'

—వెరిగుడ్, నిన్న మరవడకన్నదంతా చెప్పేశావా?'

—ఆహా అక్షరాలా.

నిన్న వాళ్లు అనుకున్నదేమిటో మరొక విద్యార్థిని అడిగాను సుశీల మెప్పుకోసం - నటరాజన్ ఏదో పద్యం చదివినట్టూ, తను విన్నట్టూ శర్మ చెప్పేడుట. ప్రిన్సిపాలు రూంలో మరొక ఆవిడకూడా ఎవరో ఉందిట. నటరాజన్ చెప్పినవన్నీ ఆవిడా విందిట

ఆ మెయిల్లో పేపరు వస్తోందని తెలిసి - ఆ పేపర్లో పరీక్షా ఫలితాలు ఉన్నాయని తెలిసి - ఆ మెయిలే లేటయితే విద్యార్థు. కెంత ఆశాభంగంగా ఉంటుందో ఆ అల వారంనాడు అందరూ అంత బాధపడ్డారు. ఎలాగయితేనేం ఆదివారం గడిచింది సోంవారం పొద్దున్నే మా శర్మ హాస్టలు నుంచి రూం ఖాళీచేసి వెళ్లిపోతూంటే మాత్రం ఆశ్చర్యం పట్టలేకపోయాను. అన్ని సంగతులూ క్రమంగా అందరికీ తెలిశాయి. నేను విన్న సంగతులు, కథలా ఉండేటట్టు మధ్య మధ్య కొంత ఊహా కల్పనచేసి మీకు అందజేస్తాను.

* * *

అవాళ మేటినీనుంచి - దారిలో నట

(48వ పేజీ చూడండి)

బహిష్టు ఆగినదా?



ఎంతకాలంనుంచి ఏ కారణంవల్ల నిలిచిపోయిన బహిష్టు నైనను దేవీపిల్సు తిరిగి అపాయంలేకుండ క్రమపరచును. ఇండియా గవర్నమెంటు (పి డి ఎల్/688) సెంట్రల్ డ్రగ్సు లేబొరేటరీ క్రింద రిజిస్టరుచేయబడినది ఇది గ్యారంటీ ఔషధము అనేక యోగ్యతాపత్రములు కలవు నకలి మందులు వాడి మోసపోవద్దు. సాధారణ కేసులకు ఖరీదు రు. 8-8-0. నెలలుగా నిలిచిపోయిన కేసులకు రు 10-8-0 వి పి పి ప్రత్యేకం.

సంతాన నిగ్రహం

స్పెక్ పిల్సు రిజిస్టర్డు నెం 266, గ్యారంటీ ఔషధము 12 రోజులు సేవించిన 6 సంవత్సరాల వరకు శాశ్వతంగా గర్భము కలుగదు. మామూలుగా బహిష్టుకు భంగం కలిగింపదు. ఇతర నకలి మందులు వాడి మోసపోవద్దు. అనేక యోగ్యతాపత్రములు కలవు. ఖరీదు రు. 12/-లు. వి. పి. పి. వేరు.

SEENU & Co., P. B. No. 1638 (J) Madras-1.

బ్రాంచిలు: సింగపూరు, కౌలాలంపూర్. ఏజంట్లు: సిలోన్, రంగూను.

ప్రాతినిధ్యంలేని తావులలో ఏజంట్లు కావలెను.

★ అయింది, అబ్బాయిగారి పెళ్లి ★

(౮-వ పేజీ తరువాయి)

రాజన్ సంభాషణ జరిగింతరవాత - ఉగాది పచ్చడిలాంటి పుల్లని, తియ్యని ఆలోచనలతో సుశీల యిల్లు చేరుకుంది. దారిలో ఆమెకు నటరాజన్ సంభాషణా అదీ తలుచుకుంటే మొదట నవ్వొచ్చింది. తర్వాత జాలివేసింది అందరు యువకుల్నీ అవలీలగా కాదనిన, కాలదన్నిన సుశీల ఎందుచేతో 'నటరాజన్ కేం తక్కువ?' అనుకోసాగింది. అదివరకు ఎన్నో సార్లు క్లాసులో చూసినా అదేమిటో ఆరోజు - ఆ యింగ్లీషు కలరు ఉలెన్ పేంటూ, లైట్ బ్లూ బుష్‌కోటూ - ఆ వేషమూ, ఆ వాలకమూ, ఆ చూపులూ, ఆ మాటలూ ఏమిటో, ఆ విగ్రహం తన కళ్లముందునుంచి కదలడం లేదు! మొట్టమొదట ఆమె కతని మీద 'నామాట వింటే నీకు క్లాసు షూరు' అన్న మాటతో కోపమే వచ్చింది ప్రిన్సిపాల్‌తో రిపోర్టుచేస్తే! అతని జీవితం ఏంకాను? ఛ, అలా ఎన్నటికీ జరగదు!

సుశీల యిల్లుచేరింది. ఆమె ఎప్పుడూ ఏ విషయమూ దాచని తల్లితో జరిగిందంతా చెప్పేసింది. 'త్వరగా పెళ్లిచేసుకోవే నా తల్లీ!' అని ఎన్నిసార్లు మొత్తుకున్నా 'పెళ్లి వద్దు పెడాకులూ వద్దూ నన్నిలా బతకనియ్, చదువుకోనియ్' అని యీ సుశీలే వాళ్లనాన్నగారు చనిపోతూ యిచ్చిన ఎనిమిదెకరాల భూమీ - యీనాటికి ఎకరన్నర చేసింది. ఇక దీనికి పెళ్లెప్పుడవుతుందో - అసలు అవుతుందో అవదో, కట్నమెంత ఎలాగ పొయ్యాలో ఆ తల్లికి బోధపడలేదు. ఇవాళ ఆమెకీ కబురు ఆశ్చర్యం కలిగించడంలో అతిశయోక్తి యేమీ లేదు

'ఇన్నాళ్లకి నిన్నెవడు చేసుకుంటాడే! నే చస్తే నమ్మను' అనేసింది సుశీల తల్లి సుందరమ్మ. అసలే సుశీలకి తగని అతిశయమూ, ఆమె ఊరుకోలేకపోయింది

'నమ్మకపోతే మానెయ్, మరేం మించిపోలేదు'

'అదికాదే, అంతట్లో కోపం తెచ్చుకుంటే ఎలా?.. పోనీ అతడు నీకూడా వచ్చి మాటాడుతున్నప్పుడు ఎవరైనా ఉన్నారా? నీమీద నమ్మకం లేకకాదు - అంత ఉద్యోగంలో ఉన్నతను కానీ కట్నం లేకుండా నీలాంటిదాన్ని చేసుకుంటాడంటే...'

'నువ్వు నమ్మకపోతే మానెయ్. నాకు రుజువు చేసుకోవలసిన అవసరం లేదు. ఇంతకీ జరిగింది చెప్పేనుగాని అతన్ని నేనేం చేసుకుంటానని సిద్ధంగా కూర్చోలేదు' ఇలా అంటున్నపుడు ఆమెకు శర్మ జ్ఞాపకం వచ్చాడుగాని - తల్లిచేత ఎంతో బతిమాలించుకున్నాక తప్ప అతనిపేరు సుశీల చెప్పలేదు

అవాళ సాయంకాలమే సుందరమ్మ స్వయంగా వరసకి అన్నయ్య అయిన ప్రిన్సిపాలు నారాయణగారింటికి వెళ్లి మాటల్లో అంది.

'ఏదో యిప్పట్లో దానిమనసు తిరుగుతుందనుకోలేదు అన్నయ్యా! ఇంతకీ మీ కాలేజీలో నీకింద పనిచేస్తున్నాడు గనుక అతని సంగతి నీకు తెలిసినంత ఎవరికీ తెలీదు. ఇంతకీ అతనివాళ్లు పెద్దవారెవరూ లేరని విన్నాను. ఇలా ముందు మోజుపడి చేసుకుని తర్వాత ఎంత లారాసిపెట్టినవాళ్లయినా ఉన్నారు. అతనిమటుకు అతనే సిద్ధపడ్డాడని సుశీల అంటోంది. నాకేమో అంత నమ్మకం గాలేదు'

నారాయణ ఆగమన్నట్టు చేత్తో సౌంజ్ఞ చేశాడు. అతనిచేతిలో అప్పటికే "లెక్చరర్ దౌర్జన్యం' అనే కాగితం ఉంది! అతడు కాస్సేపు ఆలోచించి 'రేపు పదిన్నరకి కాలేజీకి రా సుందరమ్మా, తిన్నగా నా రూంకి రా' అన్నాడు ఆవిడ ఆశ్చర్యపోయింది.

ఆడపిల్లల రిపోర్టులు అప్పుడప్పుడు అనుభవమున్నా నారాయణ యిదివరకెప్పుడూ యింత యిరుకున పడిపోలేదు. ఒకపక్క లెక్చరరూ/చిన్నవాడయినా చేసింది తప్పే. అయినా—మంచి తెలివైనవాడు. సరిగ్గా పరీక్షలముందు మానిపించేస్తే పిల్లలేమై పోవాలి? అయినా అతని ప్రవర్తన చూసి ఊరుకుంటామా అంటే ఇదేం రహస్యంగా జరిగిందా, అచ్చు అయి నెత్తికెక్కి కూర్చుంది. ఇలాంటప్పుడు తను సరిగ్గా ప్రవర్తించకపోతే యిక కళాశాలలో నీతి ఎక్కడిదీ? సుందరమ్మ వచ్చి మాటాడినప్పుడు మాత్రం అతని చిక్కులన్నీ విడిపోయినట్టే తోచింది!

ముందుగా నటరాజన్ని పిలిచి అడగ్గా అతడంతా ఒప్పుకున్నాడు. సుందరమ్మ మాత్రం 'పిల్లాడు బాగానే ఉన్నాడే!' అనుకుంది. తర్వాత శర్మని పిలిపించారు. అడగడమే తడవుగా శర్మ తన అయిదు నిమిషాలు విన్నదీ అరగంట వర్ణించి చెప్పేడు.

'ఇంతెందుకు మేష్టారూ, నే ఆఖర్ని విన్న పద్యం తలుచుకుంటే నా కిప్పటికీ నవ్వొస్తుంది చెబుతాను వినండి' (ఈపద్యం శర్మ హాస్టలు భావకవి 'రంగరాట్కవి' చేత రాయించాడనీ తర్వాత అతడు మరి కలం పట్టలేదనీ గిట్టనివాళ్లు చెబుతారు!)

"నీ వదనం ఫుల్ శశి
నీ అధరం కిస్ మిసి
నీవు లేని బ్రతుకుంటే
మిస్ సుశీ! ఛస్ మసీ/ పపస్ నిశి!!!"

ప్రిన్సిపాలు పకపక నవ్వుతూండగా శర్మ వెళ్లిపోయాడు సుందరమ్మ ఆశ్చర్యంగా 'అతను కవి కూడా నే! ఎంత బాగా రాశాడు! ఈసారి సుశీల వద్దన్నా నేను పెళ్లి చెయ్యక మానను!' అంది. నటరాజన్‌ని వెంటనే ప్రిన్సిపాలు పిలిపించి కోపంతో అన్నాడు

'ఏవయ్యోయ్, యివాళనుంచి నువ్వు హోటల్ భోజనం మానెయ్యవలసి ఉంటుంది'

'అమ్మాయ్ సుశీలా, కొన్నాళ్లలో నీ యింటి పేరూ మార్చుకోవలసి ఉంటుంది' ఆయన కృత్రిమకోపం ఆట్టేసేపు ఉండలేదు. నిర్ఘాంతపోయిన నటరాజన్ సుశీలా ఆఖరికి విరగబడి నవ్వుకున్నారు. నటరాజన్ ఆఖరికి అన్నాడు.

'ఆ అబ్బాయి - ఎవరో శర్మట - నేను సరిగ్గా ఎరగనైనా ఎరగను. నిజంగా అతడు చేసిన ఉపకారం జన్మజన్మాలకీ మరిచిపోలేను! అతని ధర్మమా అని ఒక యింటివాడ్నయ్యాను!'

సుశీల నవ్వింది! సుందరమ్మా ప్రిన్సిపాలూ కూడా నవ్వేరు. సుందరమ్మ అంది.

'మొత్తానికి మీ రాలుగాయి మేనగోడలికి పెళ్లి అయిందనిపించావు అన్నయ్యా'

'నే చేసిందేముంది? ఇదంతా ఆ శర్మ పట్టుపట్టి చేయిస్తున్న పెళ్లి. ఇంతకీ మీ అల్లుడ్ని కాసుకో, మరెవరికేనా ఫస్టు క్లాసు లిస్తానని బెదిరించేడు గనక!' సుశీల, నటరాజన్ని మోచేత్తో పొడిచింది. అందరు కలిసి నవ్వుకున్నారు. ★

ఇప్పుడే వెలువడింది!

కథాసాగరం - II

వాసిరెడ్డి సీతాదేవి కథలు

120 పేజీలు: రూపాయి

దేశికవితా మండలి, విజయవాడ-2.

శ్రీమదాంధ్ర

మహాభారతము

ఉద్యోగపర్వము

వెల రూ. 1-0-0

ఆంధ్రగ్రంథమాల

మద్రాసు-1.